# నీల

## అల్లం రాజయ్య

నీలమ్మ వంగి వరి పొలంలో కలుపు తీస్తున్నది. పొద్దు వంగి పోయింది. పగలంతా కాసిన ఎండకు నీలమ్మ ముఖం వాడిపోయింది. నెత్తి నుండి చెమటకారి ఆమె జాకెట్టంతా ఉప్పుదేలింది. పైగా వంగితే ముఖమంతా వరి ఆకుల గీరుకపోయి మంటలేస్తున్నాయి. అసలే అది అందురు పొలం. నీలమ్మ భర్త తిడుగుబోతు, నాట్లప్పుడు అటోసాలు ఇటోసాలు బెట్టి నాటైతే పెట్టిండు - నాలుగు సాల్లు దున్నకపోవడంతో పొలంలో 'తోడెంగ, ఒలిపిడి' లాంటి గడ్డి మొలిచింది. ఎండకు పొలంలో నీల్లు కాగి చురుక్కుమని పిస్తున్నాయి. నీలమ్మ భర్త ఊరందరికీ కంటే - కనుక కలుపుకు నీలమ్మ ఎవరిని బతిమిలాడినా రానన్నారు. పైగా "ఊరుకు సెడువాకం సేసినోడు. నీ మొగనికి సెప్పుకో - నీలమ్మ నీ మొగుడు అపు సూసుకొని బలుపని బముసుతండు - నీ మీద మాకేమి కోతుకం లేదని" నీలమ్మ ముఖం మీదనే చెప్పేశారు,

నీలమ్మ ఎవరిని ఏమనలేదు, అట్లని 'నాకేందని' ఊకోలేదు తనకు వీలైన కాడికి కలుపు మొక్కలు పీకిపారేత్తవని నడుం కట్టింది.... అంతకన్నా నీలమ్మ ఏం చేయగలదు ? నిండా ఇరువైఅయిదు నిండకుండానే పడరాని కష్టాలు పడ్డది - ఆమె ఆ కష్టాలకు దిమ్మెక్కి పోయింది. ఊఁ అనకుండా ఉప్పురాయి అనకుండా ఏదో వొక పని చేసుకపోవడమే అలవాటు చేసుకున్నది.

నీలమ్మ నడుమెత్తి నిట్ట నిలువునా నిలుచుండి పొద్దుకేసి చూసింది. 'ఎసాలాల్ల' దాటి పోయింది. పొలంకేసి చూసింది. ఎంత కలుపు తీసినా ఇంకా ఎకరం దాకా కలువ వల్సింది మిగిలే ఉన్నది.

కాలువ కింద కనుచూపుమేర దాకా వ్యాపించిన పక్క పొలాలల్లో కూలీలు కలుపులు తీస్తున్నారు. రంగు రంగుల చీరెలు, నవ్వులు, కేరింతలు, మధ్య మధ్య పాటలు.

రోడ్డుమీద బస్సాగింది. బస్సులో నుండి ఎవరెవరోదిగారు. బస్సులో

నుంచి దిగిన పతిమరుపు రాజాలు అదరబాదరగా ఒడ్ల మీది నుండి పరుగెత్తు కొస్తున్నాడు.

నీలమ్మ ఆ తత్తరపాటుకు విస్తుపోయింది.

రాజాలు నీలమ్మ పక్కనుంచి పోతున్నాడు.

"ఏందట్లా గావరపడి ఉరుకుతన్నవ్?" నీలమ్మ ఇంకా నిలబడే రాజాలు టక్కున ఆగిపోయి నెత్తిగోక్కున్నాడు.... ఆకాశంలోకి చూశాడు. "ఎందు కురుకు తున్న...." పైకే అని- "అఁ" అని మళ్ళీ నడక సాగించాడు....

"ఓరి నీ పతిమరుపు కాలిపోను." నీలమ్మ వంగి రెండు తోదెలగ గంటలు పీకింది....

రాజాలు పెద్ద గొంతుతో ఏదో అరుస్తున్నాడు, పిచ్చివాడిలాగా చేతులు తిప్పుతున్నాడు. కలుపుతీస్తున్న ఆడ కూలీలంత రాజాలు చుట్టూ చేరిపోయారు.

నీలమ్మ లేచి నిలబడింది....

ఆ తరువాత తత్తరపాటు కేకలు, ఏడుపులు - మిగతా పొలాలలోని వాళ్ళు పరుగెత్తుకొచ్చారు....

నీలమ్మ ఒడ్డెక్కింది....

పొలాలల్లోని "కల్లాలగడ్డ మర్రి" కిందకేసి నడిచారు వాళ్ళంతా. ఆ గడ్డ నీలమ్మ నిలుచున్న దగ్గరికి కేవలం వంద గజాలే.

"ఓ నీ బాంచెన్ ఎల్లక్కా.... నా గుండె అవిసిపోయింది. నాతీర్గగ బస్తాండు కాడ సానమంది తుప్పయ్యిండ్లు- నెత్తురు. నా అన్నను టాక్టర్ల నుంచి దుబ్బుల పడెసిండ్లు- ఎవడో ఆడు దున్నపోతు తీర్గునోండు- నీ బాంచెనాతె-మాతోటి పెట్టుకుంటె ఎవలకైన గీగతే పట్టదంట - మొత్తుకున్నడు-" రాజాలు బొచ్చె కొట్టుకుంటూ ఏడుస్తూ చెప్పుతున్నాడు.

వాళ్ళింట్ల పీనుగులెల్లగదరో కొడుకా! పెండ్లనక, సుకమనక నాత్రి పగలు గుడిసెలసొంట తిర్గితివిగదరా నా కొడుకా। అళ్ళ సేతులకు జెట్టలు బుట్ట-

ఆళ్ళ కండ్లు పెట్టన పేలిపోను. ఆళ్ళ నోట్లె" ఓ ముసలవ్వ ఎదురుబొచ్చె కొట్టుకుంటూ కింద కూలబడి ఏడుస్తోంది...

నీలమ్మకేం అర్థంగాలేదు.

ఇలాంటి ఏడుపులు నీలమ్మకు కొత్తకాదు.... సడీసప్పుడు లేకుండ తను పీకిన గడ్డి కుప్పేస్తోంది. గడ్డి ఇంటికి తీసుకపోకపోతే అత్త తిట్టిన తిట్టు తిట్టకుండ తెల్లారేదాకా తిడుతుంది. అత్త యాదికొచ్చేసరికి ఆకలి గుర్తొచ్చింది. పొద్దున్నే పనంతా చేసి అందరికి తిండిపెట్టి తను తినాలని కంచంలో అన్నం వేసుకున్నది. భర్తింకా రాలేదు. 'వస్తే తల్లి అన్నంపెడుతుందిలే' - అనుకొని తింటున్నది.

బయట అడుగుల చప్పుడు.

నోటికాడ ముద్ద నోటికాడనే ఉన్నది "సువ్వర్ముండా ఉడుకు నీల్లేవే?" అరుపు.

"ఇంట్ల కూకుండి సాటుకు మేత్తంది. అది యాల్లకు తినకపోతెట్లరా? బక్కపడిపోదూ ఇంకో మొగన్ని...."

నీలమ్మ ముద్ద పళ్లెంలో పారేసింది - పొలంకేసి బయల్దేరింది.

నీలమ్మ ఆకలి కాకుండా ఉండేందుకు నడుముకు చుట్టుకున్న కొంగు విప్పుకున్నది.

తను పీకిన గడ్డి కుప్పేస్తోంది నీల.

కూలీలంత గొనుగుతూ ఊరు పేరు లేకుండా తిడుతూ నీల పక్కనుండే రోడ్డుకేసి నడుస్తున్నారు.

"ఏమయ్యింది పెద్దవ్వా" ఓ ముసలామెను నీలమ్మ అడిగింది....

"ఏ బట్టముండా కొడుకు పున్నెం కట్టుకున్నాడో ? ఇయ్యాల్ల కాకపోతే రేపు నరుకకపోరు" ఇంకొక వడీడామె మెటికలిరిసింది.

తన భర్తనే వాళ్ల తిడుతున్నారని నీలమ్మకు అర్థమయ్యింది.

"నామంబొట్లు - గుల్లె పూజలు - తాగుబోతు ముండకొడుకులు మంది కొంపలు కాల్చుడు ఎన్నేండ్లు బతుకుతరుఫే" ఇంకొకరు.

నీలమ్మ మరింక మాట్లాడలేదు. కుప్పేసిన గడ్డి మోపుకట్టింది. కూలీ లంతా వెళ్లిపోయారు.

నీలమ్మకు మోపు లేవక అటిటు సొలిగింది. అతికష్టం మీద మోపు, నెత్తిమీదికి ఎత్తుకున్నది.

మోపు బరువుకు కాళ్లు కుదురుగా నేలమీద పడటంలేదు. పడమటి దిక్కు మబ్బు కుదురు కుంటోంది.... ఆకాశంలో పక్షులు ఎత్తుగా ఎగురుతూ ఎటో పోతున్నాయి.

రోడ్డు పక్కగల పెద్ద కాలువలో నీల్లు పారుతున్నాయి.

కూలీలు కొందరు అప్పటికప్పుడు తాలూకాకు ప్రయాణమయ్యారు.... దూరంగా తాడిచెట్ల మధ్యలోని చింతచెట్ల కింద "కల్లు మండువా" దగ్గర కూడా ఇందాకటి లొల్లిలాంటిదే లేచింది. చూస్తుండగానే అక్కడి మనుషులు రోడ్డుమీద అటిటు పరుగెత్తుతున్నారు. మొత్తానికి అక్కడి వాతావరణంలో దుఃఖం, అదుర్దా నిండిపోయింది. ఒక్క నీలమ్మకే వాళ్ళ బాధ తెలియదు. నీల్లల్లో రాయి వడితే అలలు చెదిరినట్లుగా మనుషులు చెదిరిపోయారు. అరా యేమిటి? నీలకు తెలియదు. ఎవరు చెప్పరు! నీల వాళ్ళ శత్రువు భార్య- అట్లని నీలమ్మ భర్త దొరకాదు. ఉన్న వాడుకాదు- కాని లేనివాళ్ళతో కలువక ఉన్నవాళ్ళ ఏజంటుగా తిరుగుతున్నాడు. భర్తకేం పోయేకాలమో? ఎవరితో తిరుగుతాడో కూడా నీలకు సరిగా తెలియదు. ఆమెకు తెలిసిందల్లా భర్త తాగుబోతు- ఇష్టమొచ్చినట్లు తిడుతాడు- కొడతాడు.

నీలకు కాలువలోని నీల్లను చూసేసరికి దప్పయ్యింది. మోపు ఒడ్డుమీద పడేసి కాలువలోకి దిగింది. చల్లగా, హాయిగా నీల్లు- ముఖం, కాల్లు చేతులు కడుక్కున్నది. అటిటుచూసి కొంగు నోల్లెకరిచి జాకెట్టు విడిచి పిండుకున్నది. వెన్ను మీద నీల్లు పోసుకున్నది. తడి జాకెట్టే తొడుక్కున్నది .... కొంత హాయిగా, ప్రశాంతంగా తోచింది.

గాలం కర్రలు ఊపుకుంటూ మంగలి నారాయణ హడావిడిగా ఊరుకేసి పరుగెత్తుతున్నాడు.

"నారన్నా జెరంత మోపెత్తవా?" నీలమ్మ పిలిచింది.

నారాయణ పోబోయినోడు ఆగి మోపు దగ్గరికి వచ్చాడు.

"ఏందన్నా అందరు ఉరుకుతండ్లు ఏమయ్యింది?" నీల.

"అయ్యో అక్కా నీ కెరుకలేదా!" నారాయణ ముద్ద ముద్దగా మాట్లాడిండు.

"నా కొడుకు లేదన్నా నాకెరికలేదు... " నీల.

నారాయణ ముఖం వెల్లబడి పోయింది....

"గోపన్నను సంపేసిండ్లు"

వంగిన నీల లేచి నిలుచున్నది....

"ఏ గోపన్న ?"

నారాయణ చెప్పిండు "నాకైతే ఇంటికింత 'ఎమకం' పెట్టాలని కట్టడి చేసి అన్నం బెట్టిండు" నారాయణ.

నీల తల గిర్రున తిరిగింది. శోషవచ్చింది.... మోపు మీద కూలబడి పోయింది.... ఒంట్లో నెత్తురంతా ఇంకిపోయినట్లు - మనిషి డీలా పడిపోయింది.

"ఏందక్కా అట్లయిపోతివి !" - నారాయణ ఏదో మతికొచ్చి - కాసేపు మౌనంగా నిలుచున్నాడు.

నీల తనకు తానే తేరుకున్నది. మరేం మాట్లాడకుండా మోపు నెత్తిమీది కెత్తుకున్నది. నారాయణ పరుగెత్తాడు.

అడుగువేసి తూలింది .. మొత్తం చిమ్మం చీకటి కమ్ముకున్నట్లుగా - కడుపులో ఎవరో చెయ్యిపెట్టి కలిచినట్లుగా - అగులు బుగులుగా ఉన్నది. ఎందుకో నీలకు దుఃఖం ముంచుకొచ్చింది.

నీల నడుస్తున్నది.... మోపు కింద ఆమె ముఖంలో కన్నీళ్లు కారు తున్నాయి. పెదవులు వనుకుతున్నాయి.

నీలమ్మకు ఎన్నెన్నో గుర్తుకొచ్చాయి .. దారి సరిగాలేని చిన్న పల్లె టూరు. ఆ ఊళ్లో గుంపు చింతల కింద ఓ పెంకుటిల్లు. ఆ ఇంట్లో రెండు పాత చీరెలు తనే అంచేసుకొని కుట్టుకొని ఆ చీర కట్టుకొని పేద పేదగా తిరిగే

అంతెత్తు ఆడమనిషి - ఒళ్లంతా ఉలిపిరి కాయలతో రాత్రింబవళ్లు మొగ్గం ముందు కూర్చుండి "నాడె" టక టక విసుగు విరామం లేకుండా ఆడించే పొట్టిమనిషి - అవ్వ, అయ్య తిడుతుండగా పుస్తకాలు ముందేసుకొని చదువుకునే చిరుగుల లాగు పిల్లవాడు. ఊహ తెలిసేటప్పటికి అతనే తన భర్త అన్నారు.... ఏమయ్యిందో తను తల్లిగారింటికి ఎందుకు తీసుకరాబడిందో నీలకు ఎంత ఆలోచించినా గుర్తుకు రావడంలేదు.

తనను తీసుకపోవచ్చినతండ్రి పొట్టిమనిషి మామను ఎడాపెడా తిట్టాడు. మామ అప్పటికే నేతపని బందు చేసిండు. పూటగడవడం కష్టమే అయినా తనకు మాత్రం పెట్టేవాళ్ళు....

"నీ గూన కప్పుటిల్లు సూసియియ్యలే - పొల్లగాడు నాలుగు అచ్చరం ముక్కలు సదువుతండని ఇచ్చిన- వాన్ని బర్లకు, గొర్లకు తోల్తనంటే-" తన తండ్రి కొండ్రకిచ్చి ఉమ్మేశాడు.

మామ ఏమనలేదు. అదేరాకడ తను మళ్ళా ఆ పూరికి పోలేదు.

తను పెద్దమనిషయ్యింది. ఆ తరువాత సంవత్సరానికి కాబోలు తమ ఊళ్ళో మూడు పానాదుల దగ్గర పంచాతు జరిగింది. "పార్టీ" వాళ్ళెవరో పంచాతుకు వస్తండ్లని ఊరు ఊరంతా భయపడ్డది.

పంచాదులో ఏమి జరిగిందో కూడా తనకు తెలియదు.

నీలను ఎవరో పిలుచుక పోయారు.

మూడు పానాదుల దగ్గర మండిలో కూర్చున్న గుంగురెంటికల కోల ముఖపాయన- అతనిపక్క అప్పుడే మీసంకట్టు మొలుస్తున్న తన భర్త తలవంచుకొని కూర్చున్నారు.

"నీ పేరేందమ్మా?" గుంగురెంటికలాయన ఆప్యాయతనిండిన గొంతు.

"నీల" తను. ఎవరిని చూడకుండా తలవంచుకొని.

"చివరకు నీ ఇష్టాన్నిబట్టే నడుచుకోవడానికి అందరు ఒప్పుకున్నారు. నువ్వు యుక్తవయస్కురాలవు, నీ బతుకు నువ్వే నిర్ణయించుకోవడం మంచిది నీకు గోపయ్యతో కాపురం చేయడం ఇష్టమేనా?" గుంగురెంటికలాయన.

ఆ మాట పూర్తికాకముందే "లేదు" అని తను అక్కడినుండి బయట పడ్డది. ఈ మాట తనతో అన్పియ్యడానికి తనవాళ్ళు ఎంతో తంటాలు పడ్డారు....

నీలమ్మ ఇలాంటి ఆలోచనలతో బండ్ల బాటనుండి ఊరు దగ్గరికొచ్చింది. బాటకు రెండుపక్కలా ఈత పొదలు—పాదాలు ఇసుకలో కూరుకపోతున్నాయి.

నీలమ్మ టక్కున ఆగిపోయి తలతిప్పి అటీటు చూసింది.

"నీలా" పిలుపు.

నీల ఉలిక్కి పడింది.

చుట్టూ ఎవరు లేరు తను తప్ప....

సంవత్సరమే అయ్యిందో అంతకు ఎక్కువే అయ్యిందో?

పండులాంటి చలికాలం. తను వరికల్లం దగ్గరికి సద్ది తీసుకపోయి మునిమాపురాత్రి తిరిగి వస్తోంది... పైన వెన్నెల. ఇంట్లో పసిబిడ్డ- ఏడుస్తున్నడో ఏమో అని బిర బిర నడుస్తున్నది.

"నీలా .." ఇట్లాగే పిలుపు.

తను తత్తరపడి అటీటు చూసింది.

ముగ్గురు మనుషులు తన కెదురుగా- బహుశా కుడిపక్క ఈత పొదల్లో నుండి వచ్చినట్లున్నది. దొంగల్లాగా ఉన్నారు.

"నేను లీలా...." పైన కప్పుకున్న కద్దరు తీసేసి ఎదురుగా నిలుచున్నాడు.

తను గుర్తుపట్టింది. అప్పటికే అతని పేరుమీద రోజు చావదెబ్బలు తింటున్నది. గోపయ్యంటే తన భర్తలాంటి వాడేనని అప్పుడు ఆమెకు నమ్మకం.

"నావెంట దయ్యంతీర్గ ఎందుకు తిర్గుతన్నవ్ - అనాదే ఒడిసిపోయింది గదా! నన్ను గీన్నే బొందిగ పిసికి సంపరాదు నీ కండ్లు సల్లబడ్తయ్ నీ మూలంగా సావదెబ్బలు తింటన్న" నీల దుఃఖంతో.

"నీలా నువ్వు నీ భర్త తీర్గనే ఉత్తగనే నామీద కోపం పెంచుకుంట న్నవ్-" గోపయ్య.

"మా వూరే దొరికిందా! ఏడవన్న నీ దొంగపనులు చేసుక బతుకలేవా!"

"మేము దొంగలంకాదు నీలా! మీ వూరేకాదు ఎక్కడ గరీబోల్లుంటే అక్కడ మేము సంఘాలు పెడుతున్నమ్. నీలా నువ్వు నాకిప్పుడు భర్తచేత దెబ్బలుతినే వేలమంది చెల్లెండ్లలో నువ్వొకదానివి. నీలా నీ భర్త నామీద అనవసరంగా కసిపెంచుకొని తను మాతో కూడవల్సినవాడు మా శత్రువులతో కూడిండు. నువ్వు చెప్పు నీలా!" శాంతంగా చెప్పుకొచ్చాడు ఇలాంటి మాటలు తను వినలేదు.

పక్కనున్నవాళ్ళు "ఔను సెల్లే" అన్నారు.

తను తల వంచుకున్నది. పెదిమలు వనికినయ్. అంతకన్నా అతను కూడా తిడితే బావుండును. తన తండ్రి దగ్గర నుండి కూడా ఇలాంటి మాటలు నీల విని ఎరుగదు. అది దుఃఖమో, కోపమో మరేదో తెలియలేదు.

తను మాటకొక్క తన్ను తిన్నదేగాని, ఇలా కోపం తెచ్చుకోకుండా తనకు జవాబు చెప్పినవాళ్లు లేరు.

నన్ను చెడ్డోనిగ సూడకునీలా! నన్ను నీ కష్టంలో మతికుంచుకో - నన్ను మతికుంచుకోవటమంటే - మేందేనికోసం కొట్లాడుతున్నామో దాన్ని తెలజేసుకోవటం, కష్టాలను సహించి ఊకోవద్దు. కొట్లాడాలే, నాకు నీమీదగాని, నీ భర్తమీదగాని కోపంలేదు నీలా! నీ వాళ్ళందరికి వీలైతే చెప్పు - నేను గరీబోన్ని నాకు గరీబోల్లంటే కోపంలేదని చెప్పు నీలా! సెలవు...."

వాళ్లు ఈతచెట్లల్లో కలిసిపోయారు.... వెన్నెల వెలుగులో తను ఒంటరిగా, నీలకు అదంతా కళ్ళముందు మెదిలి బరువుగా గాలి పీల్చింది. ఎడమచేతితో కొంగు తీసుకొని కండ్లు తుడుచుకున్నది....

గోవయ్య ఊళ్లోకి రావడంతో అందరి బతుకులు బాగుపడటం అనోట ఈనోట విన్నది నీల.

నీల ఒక్కొక్క ఇల్లే దాటుతూ నడుస్తోంది ... ఊరు ఊరంతా నిశ్శబ్దంగా ఉన్నది. ఎక్కడో గుడిసెలో చిన్నపిల్ల గుక్కపట్టి ఏడుస్తోంది. పిల్లను సముదాయించడానికి నీరసంగా తల్లి ఏదో గొనుగుతోంది.

నీలకు దుఃఖంస్థానే ఏదో బరువు మీదపడ్డట్టుగా ఉన్నది.

నీల తమ ఇంటి ముందటి మొండిగోడ లోపలికి జొరబడింది.

రెండేండ్ల కొడుకు శ్రీను తప్ప తప్ప అడుగులేస్తూ వచ్చి నీల కాళ్ళకు చుట్టేశాడు. నీల గడ్డి మోపు కిందపడేసి కొడుకును ఎత్తుకొని గుండెల కదుము కున్నది.

నీల అత్త ఇంట్లోనుంచి బయటకొచ్చి కుడిచెయ్యి నుదురుకడ్డం పెట్టి సూర్యున్ని చూసి ముఖం ముటముట లాడిచ్చి - "గింత పొద్దాలచ్చినవ్, అగలపోరి ఆకిలూడి త్తె బెచ్చులకు బెచ్చులే లేసినట్టున్నది సంసారం - మిండెడు మునిగి ముత మాయమై పోయిండనా?" చేతులారుస్తూ.

నీల ముఖం వెలతెలా పోయింది.

నీల అత్త రంగమ్మ శంకిలిమనిషి - మొగుడు బతికుండగ అతన్ని తిన్న తిండి పెయిన బట్టకుంట తిట్టి తిట్టి మనిషివి మూగ మొద్దును చేసింది. తను ఎప్పుడు అదినొచ్చె ఇదినొచ్చెనని వగలుపోతూ ఎదుటి మనిషిని తిట్లతో లొంగ దీయడం అనే విద్యతో ఆమె జీవితమంతా కష్టపడకుండానే వెళ్లిపోయింది. రంగమ్మ తిట్లకు వశపడకనే మొగడు ఉరిబెట్టుక సచ్చిండు. ఆమె నోరిప్పిందంటె ఊరు ఊరంతా గజు గజు లాడవల్సిందే. ఎక్కడ దెబ్బకొట్టాలో, మనిషి ఆయు పట్లు ఎక్కడుంటాయో రంగమ్మకు బాగా తెలుసు.

"నా కొడుకును ఆడిపోసుకున్న లంజెలు, లంజె కొడుకులు గట్లనే పోతరు. నెగులబుట్టని కోడిపిల్ల మంచం మూడుసుట్ల - ని ఆడు బతికిండా? బతుకనిచ్చిండా? లేమిడిగాడ్దికొడుకు లేకి బుద్దులు - నా కొడుకు జెట్ట ముండను ఏమంట కట్టుకున్నాడో శని సుట్టుకున్నది - నా కొడుకు కండ్లనిండ నిదురబోలే - కడుపునిండ తినలే, గాయిగాయి తిరిగి."

నీల మాట్లాడలేదు, మాట్లాడాలనే ఆసక్తి, రోషం ఏనాడో చచ్చిపోయి నాయ్ ... మాట్లాడ్తె అత్తకు తిట్లకు ఆ మాట ఆధారమౌతుంది,

"మాట్లాడవేందే బట్టులంజె" రంగమ్మ రొండిమీద చెయ్యి వేసుకుని నిట్ట నిలువుగా నిలుచుండి అడిగింది. తనకు తిట్టడానికి కొత్తవిషయం కావాలి.

నీలకు సర్రున కోపమొచ్చింది. "నోరిప్పతే పురుగులు రాలుడేనాయే" నీల.

"నీ నోట్లె పోశమ్మ కూసోను, నీ నోరు పడిపోను ఊళ్లె లంజెలంత

నా నోరు మీదనే ఏడుత్తరు, మీ నోర్లు పడిపోయినయా ? మూసుక పోయినయా ? ఓసి బొడ్డికానా ! నా నోరు మంచిదిగాదే ! కని నువ్వో - సముర్తయి ఆనిదగ్గర పండి, అడుసాలక ఇడుపుకాయిద మిచ్చి నా కొడుకును సేసుకున్నవ్"

"అత్తా!" నీల దాదాపుగా అరిచినట్లుగా అన్నది. అ మాట పాతదే గాని - నీలకు ఇప్పుడు భరించే శక్తి లేదు.

ఆ కంఠంలోని తీవ్రతకు రంగమ్మ విస్తుపోయింది, కాని తను ఓడిపో దలుచుకోలేదు.

"ఏందే? లావురేషపడ్తన్నవ్- మిండెన్నంచే పొడుసుకత్తందా?"

"ఇంకో మాటంటె-" నీల కండ్లు ఎరుపెక్కాయి. తల్లినిచూసి సంకలో కొడుకు దద్దరిల్లి ఏడవసాగిండు.

"కొడుతవానె లంజెకాన - తెగినదానివి. లాకల్ అంటనే. అడు ఊరు ఊరంత కుప్పజేసి నా కొడుకుమీనికి ఉసిగొల్పితే పెండ్లానివైన నీకు రేషంలేదు. అడుమాదిగి మన్నేల...." రంగమ్మ కోపంతో ఊగిపోయింది.

నీల మరింక అక్కడ ఉండకుండా ఏడుస్తున్న కొడుకును నేలమీద పడేసి గడ్డిమోపు తెచ్చి "బర్రెమట్టు"కాడ పడేసింది.

బర్రెమట్టు దగ్గర దుడ్డె నీల్లకోసం గింజుకుంటోంది. బాయి దగ్గరికి తీసుక వెళ్ళి నీళ్ళు పెట్టింది. దుడ్డె నీల్లబొక్కెనమీద విరుగబడి తాగింది.

శ్రీను వెక్కి వెక్కి ఏడుస్తూ తల్లి ఎటు తిరుగుతే అటే తిరుగు తున్నాడు....పడుతూ లేస్తున్నాడు.

"ఈ ఇంట్ల అందరు తినెటోల్లె - దుడ్డెకి నీల్లుబెట్టే దిక్కులేదు. దిక్కు మల్లె ముండకొడుకు వన్నెందుకు కన్నడు. అడిపుటుక పుట్టేబదులు అడివిల మానై పుడితె మంచిది, మంచి మంచోల్లకు సావత్తదిగని నీలి ముండకు సావురాదు." చివరి మాటకు నీల గొంతు ముద్దైయిపోయింది కండ్లల్లోనుండి నీళ్ళు జలజలా కారాయి.

"నీ తల్లిగారింటి కాన్నుంచి తెచ్చిపెట్టినావె లంజె. నా ఇల్లు నా తిండి" అత్త బింకంగా అనుకుంటూ ఇంట్లోకు వెళ్ళింది.

"నా తల్లిగారు మునిగి ముతమాయమై పోయిండ్లు- నాకే తల్లిగారుంటె గీనరకం గీమాటలు బడుదునా" నీల కొడుకును ఎత్తుకొని కన్నీళ్ళు తుడిచింది- ముక్కు చీమిడి తుడిచింది. ఉచ్చ పోసుకొని శ్రీను చెడ్డంతా తడిగాను పట్టినిండి ఉన్నది. పిల్లవాడు దుమ్మునిండి చీదర చీదరగ ఉన్నాడు. పైగా "నషిమీరి" పుండ్లు. 'ఒక్కగానొక్క కొడుకుకు తానం బోసి తయారుజేసే పుర్సత్' లేనందుకు ఆమె మనుసు విలవిల లాడింది.

పిల్లవాడు పాలకోసం తడుముతున్నాడు. అంతే అత్త కాసంత బువ్వ తినిపియ్యలేదన్నమాట- పిలగాన్ని ఒళ్ళో వేసుకొని వాకిట్లో కూర్చుండి- కొంగు కప్పి పాలిస్తోంది.

నీలకు మొదటిసారిగా తన బతుకుమీద రోత కలిగింది. ఈ బతుకు బతికేకంటె ఏ కాలువలోనో బండగట్టుకొని పడి సచ్చింది మేలు-ఎవరిని ఉద్ధరించ బతుకుతున్నట్టు?

పాలు చీకుతూ చీకుతూనే కొడుకు నిదురలోకి జారుకున్నాడు - కొడుకు పెదిమలు తుడిచి- లేచి నిలబడి కొంగు భుజం మీదేసుకొని వెళ్ళి పాతచీరతెచ్చి, చీర పందిరి కింద నులక మంచంలో కొడుకును పడుకోబెట్టింది.

ఈగలు "జిబ్బు జిబ్బు"మని తిరుగుతున్నాయి. కొడుకుమీద చీర పెగల కప్పింది....

రంగమ్మ ఇంట్లో మూలుగుతోంది. కొడుకొచ్చేదాకా అట్లాగే ఆపసోపాలు పడి రాగానే ఉన్నయి లేనియి కల్పించి చెప్పడం, ఆ కొడుకు ఈ కల్పనలు నమ్మ తన్నడం నీల పొద్దుగ్గా గాలి విడిచి కొంగు బొడ్లో దోపుకున్నది.

ఇల్లు దొంగలు దోసినట్టుగా ఉన్నది. శ్రీను అడుకున్న చాట, సోల, రాళ్ళు, రప్పలు, కట్టెసిలుక, గంగెద్దు ఎక్కడియక్కడే పారేశాడు. ఒక్కొక్కటే తీసి పక్కకు పెట్టింది నీల. వంట చెయ్యాలి. "సందగదు (సాయంత్రం సంధ్యా వాకిలి పూడ్చడం) తియ్యాలె - బర్రెకు కుడితి కలుపాలె - పొయిలకు కొట్టిన కట్టెలులేవు- పెరిగిన బియ్యంలేవు- కూరేమి వండాలో తెలియదు ? పప్పు మొగనికి సార్రుడుపోదు.

ఇంట్లో నుంచి బయటకు వెళ్లి కట్టెలమండె దగ్గర నిలుచున్నది - చేతిలోకి గొడ్డలి తీసుకున్నది. మొట్టును అడ్డం జరుపుదామని వంగేసరికే చీరమీద 'మైల' కనిపించింది. నీలకు చెప్పరాని దుఃఖం కలిగింది. అసలే మనసు మొద్దు బారున్న సమయంలో ఇదొకటి - ఇప్పుడు అన్ని పనులట్లాబెట్టి జరూరుగ నీల్లు కాగ బెట్టుకొని స్నానం చేయాలె.

నీల్లకుండ తను ముట్టుకోకూడదు - అత్తను బిలుత్తే 'అంకచండాలం' కడిగిపోత్తది. మొండిగోడ మీది నుండి అవలింటికేసి నిక్కి చూసింది. చక్కగా పాకిన బీర పందిరికింద సావిత్రి బియ్యం కోడుతోంది. "సావిత్రక్కా" అన్న పిలుపు నోటిదాకా వొచ్చింది. అత్తచూస్తే మళ్ళీ అదోగొడువ ఇద్దరుకలిసి ఏవో గుసగుసలు పెడ్తండ్లని.

"సన్నీళ్ల పోసుకుంటె సత్తనా?" బాయి దగ్గరికి నడిచింది. బాయి ముట్టుకోవద్దు - అందుకైనా పిలువాలె.

"అఁ ఏవున్నది, దిక్కులేనోల్లు ఏంజేత్తరు." గబగబా బాయిలోకి చేద వేసి నాలుగు బొక్కెండ్ల నీల్లు నెత్తిమీద కుమ్మరిచ్చుకున్నది. అప్పుడు యాదొచ్చింది చీరెరయికె తెచ్చుకోలేదని, అత్తను పిలిచేదిలేదు.

నీలమ్మ నీల్లు కారుతున్న ఒళ్లతో ఇంట్లో కొచ్చేసరికి రంగమ్మ నోట మాట రాక దయ్యాన్ని చూసినట్లుగా గుడ్లు తేలేసి చూసింది.

"నీలీ - అన్నంత పని చేసినావే?" అన్నది.

నీల ఆ మాటను ఖాతరు చెయ్యకుండా చీరజాకెట్టు అందుకున్నది.

"మిండెడు సచ్చిండని తలార తానంజేసినావే రంకుముండా?" రంగమ్మ కూడదీసుకొని ఓడిపోయిన గొంతుతో.

"ఔ - నా మొదటి మొగుడు సచ్చిండని" అన్నది.

ముసలి రంగమ్మ తొలిసారిగా దెబ్బతిన్నది. ఆ మాట కోడలు అనగల దని ఊహించలేదు. మరింక రంగమ్మకు మాటలు రాలేదు ఏడుపు వొచ్చింది - పెద్దగా శోకాలు పెట్టడం సాగించింది.

నీలకు తన విజయం తెలిసింది. తన బతుకులో మొదటిసారిగా ఇలాగా ఇంకొకరు ఏడుస్తుంటే చూస్తున్నది.

పొడిబట్టలు కట్టుకొని తడి బట్టలు మూటకట్టి బాయికి దూరంగా ఓ కర్ర మీద పెట్టింది.... గొడ్డలి తీసుకొని పొయ్యిల చెక్కలు పగులవేసింది. ఇంటెనుక పందిరికింద పొయ్యి శుభ్రంచేసి మంట రాజేసింది - బుగ్గెండి గంజులో ఎసరు పడేసి, బియ్యం చెరిగి గంజులో వేసింది. చీపురు తీసుకుని ఇల్లంతా ఊడ్చింది. తలగోల్ల కొట్టుకొని - కూరేంవండాలా అని ఆలోచించింది.

కూరనార రుచిపచి అనకుండా తినే లేత ముఖం సిల్లవాడు గోపయ్య కన్పించాడు. గొడ్డుకారం - ఊదుకుంటూ తను తినలేకపోతే తల్లితో పోట్లాట పెట్టుకోవడం గుర్తొచ్చింది.

నీల ఇంటి బయట కొచ్చింది. అప్పటికి ఎండపొద ఇండ్ల కప్పులమీద పారాడుతోంది - గోడలనీడలు వాకిల్లను, బజార్లను కప్పేశాయి. దిగాలుపడ్డ మొఖాలతో, బురద చిల్లిన ఒళ్ళతో - వాడిపోయి, పొడలిపోయి జనం ఇండ్లకు మల్లుతున్నారు.

బండారు పోశాని ముసలవ్వ నడిబజాట్ల నిలబడి దారినపొయ్యే వాళ్ళ నల్లా "ఏమయ్యిందని" అడుగుతుంది.

ఎవలు సడీసప్పుడు చెయ్యటంలేదు. ఆ ముసలమ్మకు జవాబు చెప్పడంలేదు.

"ఏంబుట్టిందర్రా? నోళ్ళల్ల బెల్లంగడ్డలు బెట్టుకున్నర్రా - ముసలి ముండకు కూసంత సెపులేత్తే అరిగిపోతరా? కరిగిపోతరా? పొద్దాల 'బంటకు' కంకెడంత తినిపోయిండ్లు కొడుకులు. దినాలు మంచియిరాలే - పాడు మనుసు అగదాయె - ఇంక రాకపాయిరి. ఔరా! నువ్వు దొమ్మటోల్ల సాంబయ్య వేనా? మా మధునయ్యను జూస్తివా? ఇంక రాక పెయిరి మా వోళ్లు" పోశాని ముసలవ్వ.

"నేను ఎంబడోల్ల సత్యయ్యను పోశవ్వ" అన్నాడు నిలబడి.

"నీ బాంచెన్ బిడ్డ - సచ్చి నీ కదుపునబుడత"

"నీ కొడుకుల కడుపుల్నే పుట్టేవ్ తియ్యే"

"అట్లనే కానియ్యి బిడ్డా! ఏం జరిగింది బిడ్డా! అందరు మన్నుదిన్న పాంజేసు గున్నలతీర్గ పోతండ్లు - నా కేందో అగులు బుగులుగున్నది బిడ్డా!"

"మంచి మంచోల్లు మన్నయిపోంగ దూదేకులమియ్య దుడ్డుబట్టిండట - ఇనేంజేత్తవే?" సత్తయ్య ఎడ్లనదిలించుకొని వెళ్లిపోయాడు...

"నీ కాడుగాల నువ్వు పోవట్టివిపిలడా ?" ముసల్ది పుతుకులాడుకుంట ముందుకు నడువబోయింది.

నీలకు ఆ సంగతి చెప్పాలనే ఉన్నది. కాని అడుగు ముందుకు పడలేదు. నోరు పెకలలేదు. ఏమని చెప్పుతుంది అతనిగురించి తనకేం తెలుసు ?

వర్పెక్కల గాలిగాడు "గుమ్మినిండ పందికొక్కు - గుమ్మి కింద కందిపప్పు - దెసెంనీతల్లి - గుమ్మినిండ కందిపప్పు - గుమ్మికింద కందికొక్కు - ద్దుతెరి కందిపప్పు" అనుకుంటూ ఉరికొచ్చాడు. ఆ మాట అనడానికి ఎన్ని తంటాలు పడినా నాలుక తిరగడంలేదు.

"నీ సంబురం పాడుగాను గాలిగా జెర ఆగురా!" పోశాని ఆగబట్టింది.

గాలిగాడు తను ఇందాక అనే మాట మరిచిపోయాడు.

"ఏమయ్యిందిర - సడకుపక్క కొట్లాటగిన అయ్యిందా? పోలీసోల్ల మోటరొచ్చిందా? ఎందుకనో పిల్లివట్టిన కోడిపిల్లలతీర్గయి పోయిండ్లు"

"కందికొక్కు" - నెత్తిగోక్కుంటూ గాలిగాడు.

"నీ ఇంట్ల పీన్గెల్ల - ఎనుకడెవడో 'సెలిమకాడ' పజ్జెం పర్సిపోయి మా అత్తగారిచ్చిన 'అర్నం అవు'గిన్నే పోయిందంట ఉసికంతా గెలికిండంట - పెండ్లాం వచ్చి తన్ను తందునా? అన్నదంట - అం తానే తందానా! అన్నడట" పోశాని మాతులు పొడిచి "ఏమయ్యిందిరా ?" అన్నది.

బిత్తరిచూపులు చూశాడు గాలిగాడు, నెత్తి గోక్కున్నాడు.

"ఓ అదా! గోపన్నను సంపేసిండ్లట" గాలిగాడు.

"ఓర్ని నోరు పడిపోను, నిచ్చమా ? అవద్దమురా? ఎవడు పున్నెంకట్టు కున్నడురా?" పోశాని కంఠంలో వొనుకు.

"నాకేమెరుక - మేకపరుక" గాలిగాడు ఆ మాటనే పాటలాగా పాడుతూ పరుగెత్తాడు.

ముసల్ది నవనాడులు కుంగిపోయినట్లుగా చేతికట్టె నేలమీద పదేసి బజాట్లో కూలబడిపోయింది. ముఖాన కొంగుబెట్టుకొని ఆ నిరుపేద ముసల్ది తన కొడుకే చనిపోయినట్లుగా ఏడ్చింది దాని మనసులో గోపయ్య పాడే పదం "కక్కుర్తేర్గుడు బెట్టి లచ్చుమమ్మో" మెదిలింది, తమ ఇంట్లో మనిషిగా మెదిలిన సంగతులు గుర్తుకొచ్చాయి.

నీలకు ముసల్దాని దుఃఖానికి, గోపయ్య చావుకు ఉన్న బాంధవ్యం తెలియదు.... ఊరి వాళ్ళంతా అతని గురించి అంత కలవెల ఎందుకు పడుతున్నారో?

నీల బీరతీగ వెంట వెతికి మూడు బీరకాయలు తెంపింది. బీరపువ్వులు పసుపుపచ్చగా, పసిపాప నవ్వుల్లా విచ్చుకుంటున్నాయి. ఇంటివెనుక చింత చెట్టు మీదికి కవ్వర, కవ్వర మంటూ పక్షులు చేరుకుంటున్నాయి. మామూలు రోజుల్లో నైతే వీధిలో నడిచే మనుషుల మాటలే ఆ పక్షుల అరుపులను మించి విన్పించేవి - ఊరపిచ్చుకలు పిచ్చర పిచ్చరమంటూ అటుదునికి ఇటుదునికి చూరుకిందికి చేరుకుంటున్నాయి.... ఇండ్ల కప్పులమీది ఎండపొడ మటుమాయమైన గోపయ్య ప్రశాంతమైన ముఖంలాగే విష్కృ్రి మిస్తోంది. దుఃఖంలా నల్లబారే ఊరు.

నీలకు అనంత కోటి మాటలు పోటెత్తాయి.

* * *

బ్రాండిషాపు వెనుకాల అందంగా కత్తిరించిన చెమన్ అరమధ్య అయిదుగురు కూర్చుండి తాగుతున్నారు. వాళ్ళముందు టేబిల్ మీద కోడి ఎముకలు చిందర వందరంగా పడివున్నాయి.

అక్కడ కూర్చున్న అయిదుగురు ఇంచుమించు ముప్పయి సంవత్సరాల వాళ్ళే - అంతా ఒకేకత్తు అయినా తలోరకంగా ఉన్నారు. టేబుల్కు అపక్క, ఈపక్క ఇద్దరిద్దరు కూర్చున్నారు. ఎదురుగా కూర్చున్న తను హుందాగా ఠీవిగా ఉన్నాడు. అక్కడ కూర్చుండి తాగడం అతనికి చిరాకుగాను కోపంగాను ఉన్నది.

బ్రాండిషాపు కౌంటర్‌మీద విసుగు నిండిన గొంతుతో పొడుగ్గా ఉన్న తను "వీళ్ల ఈ రాత్రంతా తాగేటట్టుగానే ఉన్నది" పైకే అనుకుంటూ బ్రాండి షాపు ముందు మూడు మోటారు సైకిళ్ళను దిగాలుగా చూశాడు- అతనికి ఈ కస్టమర్లు షాపులోకి రావడం కొత్తే.

పెట్రోలింగుకోసం వచ్చిన పోలీసులు రోడ్డుమీద నిలుచున్నారు.

అందులో ఒకతనువొచ్చి. "ఈ సైకిల్ మోటర్లు ఎవలయని మా హెడ్ కానిస్టేబుల్ అడుగుతండు సార్-" అన్నాడు.

"ఒకటి గోపయ్యది...." అసహనంగా-

పోలీసు ఢంగై పోయాడు.

"లేకపోతే ఏందయ్యా- బ్రాండిషాపులకెవరొస్తరు? నీ దగ్గర టార్చున్నదా? వీధి లైటుల బండి నంబర్లుచూసి చెప్పుపోరాదు" అన్నాడు కౌంటర్‌మీది మనిషి-

పోలీసు ఎగాదిగాచూసి మోటారుసైకిల్ల చుట్టూ తిరిగి నిలబడిన పోలీసుల దగ్గరికిపోయి ఏదో చెప్పాడు....

హెడ్ కానిస్టేబుల్ పోలీసు తీవితో "షాపు మూసేయవయ్యా" అన్నాడు కరుకుగా....

"లోపల కూర్చున్న వాళ్ళకు చెప్పరాదు" అన్నాడు కౌంటర్‌వాలా-

ఇందాకటి పోలీసొచ్చి నిలుచున్నాడు మిగతావాళ్లు వెళ్ళిపోయారు. కౌంటర్ మీదివ్యక్తి ఓ క్వార్టర్ బాటల్‌తీసి యిచ్చిండు.

చమన్ లోపల నల్లగా కుదిమట్రంగా ఉన్నతను "మనం విలేజిలెవల్లకు పోవాలా" అన్నాడు ఖాళీప్లేట్లో పునుకుతూ....

ఎడంపక్క కూర్చున్న తను. "నాకైతే సావుకచ్చింది" అన్నాడు తడబడుతూ... అదే అదవని.

"వీనమ్మ అన్నీ బొక్కలే" ఇందాకటి నల్లటి అతను.

"మాంసపు ముద్దలుంటయనుకున్నావా?" ఇందాకా భయపడినతని పక్కతను....అందరు నవ్వారు. ఎదుటివ్యక్తి. భయపడిన వ్యక్తి తప్ప....

ఎదురుగా కూర్చున్నతను మొకు్కబడిగా వాళ్ళకోసమే కూర్చున్నట్లుగా కూర్చున్నాడు.

మెల్లెగా లేచి షాపు బయటకొచ్చాడు... కౌంటర్ మీది వ్యక్తి హమ్మయ్య అనుకున్నాడు.

ఇందాక భయపడిన వ్యక్తి తూలుతూ అతనిదగ్గరి కొచ్చాడు.

"రావ్ సాబ్ మీ పొలాలు మల్ల నాట్లుబెట్టిచ్చినం... వాడునచ్చిండు. నేనే చెప్పిన్నని-పట్టిచ్చిన్నవి మా వూరోల్లు వామీదిక స్తరు."

నీకు అంత ధైర్యమున్నదని మీ వూరోల్లు నమ్మతరముకుంటున్నావా? పోనీ నీకు నువ్వైనా! నమ్ముతున్నావా? ఖైర్."

"నువ్వు నాకోసం రాలే- నా సేవలు జెయ్యలే-నచ్చినవాడు నీ పెండ్లాం మాజీ మొగడు- అదీ నీమంట.. నువ్వు మా పార్టీల జేరింది నీ బలానికే విన్నవా? తిరుగుబోతువు-పైసకు గొరగానివానివి-ఈ బ్రాండిషాపులో నా పక్కన కూర్చుండి తాగేదన్క ఎదిగినవ్ చాలదా?" అతను సైకిల్ మోటర్ స్టార్టు చేసిండు.

భయపడే అతను- దగ్గరికిపోయి-" మీరు తలుచుకుంటె కొంతకాలం ఎక్కడనన్న పంపియ్యగలరు."

అతను బలంగా నెట్టాడు- భయపడే అతను కిందబడిపోయాడు- బట్టలు-తెల్లటిఖద్దరు బట్టలు దుమ్ముకొట్టుక పోయాయి....

ఇందాకటి నల్లటి మనిషివచ్చి లేపి "రావుసాబ్ కోపంలున్నడు. మనం రావుసాబ్ కోసం చేస్తిమా? దేశభక్తి ఉండిగని- పా॥ నువ్వేం భయపడకు నేను మీ వూళ్ళో దించివస్త ." అన్నాడు అనునయంగా-

సైకిలు మోటరమీద వెనుక కూర్చున్నాడు- నల్లనతను కౌంటర్ మీదికి వెళ్ళి అప్ బాటిల్ తెచ్చి చేతికిచ్చాడు.

సైకిలు మోటరు ఊళ్ళోనుంచివచ్చి నీలమ్మ ఇంటి ముందాగింది.

ఆ శబ్దానికి నీల ఉలిక్కిపడి లేచి తనభర్తే అయిఉంటాడని తలుపు తీసింది. ఎదురుగా తనభర్త సత్యనారాయణ- ఇంకెవరో తనకు తెలియని మనిషి-తనకేసి అదోలా చూస్తున్నాడు.

భర్త లోపలికొచ్చాడు. బైట సైకిల్ మోటరు మోత అంతకంతకు దూరమయ్యింది.

సత్యనారాయణ సొలుగుతూ పోయి మంచంమీద కూలబడ్డాడు. తెచ్చుకున్న సీసామూత తీసి గటగటా తాగాడు.

"అవలతాగింది సాలలేదా ?" నీలమ్మ కొడుకును తీసి నేలమీద సాపేసి పడుకోబెట్టింది....

సత్యనారాయణ మాట్లాడకుండా తాగుతున్నాడు.

"అన్నం తింటావా ?" నీల.

సత్యనారాయణ కండ్లు ఎర్రగా జ్యోతుల్లా ఉన్నాయి! ముఖం ఉబ్బి ఉన్నది. లోపలెక్కడో దగాపడ్డ మంట - మరోపక్క శాశ్వత శత్రువు చనిపోయినందుకు సంతోషం - అతని అనుచరులు పగబడతారేమోనని భయం....

నీల భర్తదుమ్ముకొట్టుక పోయిన బట్టలు, ఉబ్బిన ముఖం, ఎరుపెక్కిన కండ్లు చూస్తున్నది. కొత్తగా, వింతగా అసహ్యంగా ఉన్నాడు. ఈ మనిషితో తను ఇన్నేండ్లు కాపురం చేసింది, తన్నులు తిన్నది...

"నీ మాజీ మొగన్ని.... సంపేసిండ్లే లంజెకాన" సత్యనారాయణ బొంగురుగా,

నీలకు చెప్పరానంత అసహ్యం కలిగింది. మాజీ మొగుడు, మాజీ మొగుడు - అందరిది ఒక్కటే మాట - తల్లిది, కొడుక్కది - నీల చివ్వున లేచి పోయింది, కాసేపాగి కంచంలో అన్నం తెచ్చింది.

సత్యనారాయణ ఊగుతూ లేచినిలబడి కంచం తీసి విసిరికొట్టిండు.... అది బొకబొక లాడింది. అన్నమంతా చెల్లాచెదురుగ పడిపోయింది, కూర నీల ముఖం మీద పడ్డది.

"నీకు దుఃఖంగున్నదా ?" సత్యనారాయణ నీల చెయ్యిపట్టి మీదికి గుంజుకున్నాడు. భర్త కళ్లల్లో పశువు కామం.

"నువ్వు సత్తె ఏడవననుకుంటన్నవా ?" నీలకు ఏం మాట్లాడాలో తోచలేదు. కోపంలో ఏదో అన్నది విడిపించుకొని దూరం జరిగి.

"లంజె " సత్యనారాయణ నీల వెంట్రుకలు పట్టి పెడీ పెడీన గుద్దిండు, జాకెట్టు పర్రున చింపిండు, తన్నిండు.

"పో లంజా, నువ్వు నా పెండ్లానివి కాదు" వెంట్రుకలు బట్టి బయటకు ఈడ్చిండు....

పిల్లవాడు శ్రీను లేచి మొత్తుకున్నాడు.

"వీడు నాకు పుట్టలేదు" సత్యనారాయణ పిల్లవాన్ని బయట పడేశాడు. తలుపులు బిగించుకొని తాగసాగిండు.

అత్త రంగమ్మ "లంజెకాన నా కొడుకునేమన్నవే- నీకేం బుట్టిందే మార్నగాలం." అంటూ మంచాలనుంచి లేవకుండానే తిడుతున్నది.

నీల ఏడ్వలేదు... కొడుకు నెత్తుకొని ఇంటిముందర గుడిసెలో బర్రె మట్టు దగ్గర కూర్చున్నది. పెదవిపగిలి నెత్తురు కారుతున్నది. వీపులో పొంగి పోయింది....చేతి మట్టలమీద పాతదెబ్బల మచ్చలున్నాయి.

పైన మబ్బులు కమ్మిన ఆకాశం - ఒళ్ళో ఏడిచే కొడుకు. ఆ దెబ్బలు నీలను బాధించలేదు.... కొడుకు నోట్లో రొమ్ము పెట్టింది .... ఎక్కడో నీలకు మసగ్గా, సన్నగా ఉన్న దారంలాంటి బంధమేదో తెగిపోయినట్లుగా అన్పించింది.

ఎప్పటినుంచి ఉరుముతున్నదో తెలియదు. కాని ఇప్పుడు తన మన సులో పిడుగులు పడుతున్నాయి. ఉండీ ఉండీ మెరుస్తున్నది. బర్రె తన బిడ్డను నాకుతున్నది.

నీలకు ఎండా, వాన, చలి, చిన్నతనం లేగదూడలా పరుగులు తీసిన రోజులు గుర్తొచ్చినయ్. తండ్రి బట్టల దుకాణం, మొదటి పెండ్లి, ఆ తరువాత సత్యనారాయణతో కాపురం- తను ఎక్కడ మొద్దుబారి పోయిందో గుర్తుకురాలేదు. భర్తచేత తన్నులు తినడం నీలకు ఇది ఎన్నోసారో, ఈసారి బయటకు గెంటే శాడు ...సత్యనారాయణ మొదటిరాత్రి - తలుపులు బిడాయించి తనను అడిగిన మాటకు బెదిరిపోయింది. ఎదురితిరిగింది. సత్యనారాయణ మొదటిరాత్రే మీదబడి కొట్టిండు. అప్పుడు తను బయటకు పరుగెత్తి పదహేను మైళ్ళు ఆ చీకటిరాత్రి తల్లి గారింటికి పరుగెత్తింది. మరింక మొగోడనే వాని మొఖం చూడననుకున్నది- "కాపురం జేసినంక వాడే మారుతడని" తండ్రి మళ్ళీ దిగవిడిచిపోయాడు.

భర్త మారలేదు. తను చెప్పినా నమ్మకుండా బయట భజనలు. పూజలు మొదలు పెట్టింపు. అందరికి శత్రువు అయిన మనిషి పంచలో చేరిపోయాడు. రోజు రోజు దిగజారాడు.

తను మరింక తండ్రికి చెప్పుకోలేక పోయింది.... రాను రాను తండ్రి తనను పట్టించుకోవడమే మానేశాడు. అన్నలు వేర్లు పడిపోయి ఎవల బతుకు వాళ్లదయ్యింది. బట్టల దుకాణం పోయింది. తండ్రిని కొడుకులు చూడరు. తన తండ్రే పొట్ట గడవటంకోసం బట్టల మూటలు మోసుకొని ఊళ్ళవెంట తిర్గుతున్నాడు.... అంతటితో తల్లిగారింటి బాంధవ్యం తెగిపోయింది. ఊళ్ళో తన బాధలు వినే వాళ్ళెవరన్నా ఉన్నారో లేదో కూడా తెలియదు - తను - ఇల్లు - తన ఇష్టాఇష్టాలతో ప్రమేయం లేకుండా అందరు తనను బాధపెట్టారు.

ఒళ్ళో కొడుకు నిదురబోయాడు వాడికి ఈ బాధలు తెలుస్తున్నాయా? ఎప్పుడో చిన్నప్పుడు చిందు మాదిగివాళ్ళు ఆడిన భాగోతంలో బాలనాగమ్మ మతి కచ్చింది.... మాయలపక్కీరు గుహలో కుక్క తీర్గపడుంటుంది బాలనాగమ్మ- నీలా మొగ కుక్కవుకాదు - ఆడి కుక్కవు - పిరికెడు మెతుకుల కోసం ఈ ఇంట్లో పడిఉంటున్నావు బైట దిక్కులేదు. ఆ కుక్క బతుకు కూడా మరింక సాగేటట్లు లేదు- బాలవద్దిరాజులాగా తన కొడుకు తనకు సుఖం కలిగిస్తాడా? ఆ రెండు సంవత్సరాల నషిమీరు పుళ్ళ కొడుకును గుండెల కదుముకున్నది. వెచ్చని కన్నీళ్లు కొడుకు ముఖంమీద పడుతుండగా ముద్దులాడింది. 'నా కొడుకా బాలవద్దిరాజా! నీవి తేతపాదాలు- నువ్వు పెరిగి పెద్ద గెప్పుడైతావ్- నీతల్లి ఏడ కుక్కయిపోయిందో ఎప్పుడు తెలుసుకుంటవ్ - ఏడేడు సముద్రాలు ఎప్పుడు దాటేవ్? అప్పటిదాకా నీతల్లి బతుకుతే కదా! నాయిన్న నువ్వు దిక్కుపల్లె నీఅమ్మ కొడుకువేగాని-బాలవద్దిరాజువుకావు నా తండ్రీ-నా తండ్రీ బాలవద్దిరాజులను పక్కీరోల్లు బతుకనిస్తరా?'

ఉరుములు హెచ్చాయి.... మరింక తనెక్కడికి పోగలదు? తను ఎవరి అంటు సొంటుకు బోయినా అళ్ళకు అజన్మ బాధలు సుట్టుకుంటయ్ - తన పుటుకే మంచిదిగాదు. "దేవునిగుళ్ళె రాయివడ నా ఆసొంటిదాన్ని కొంటబోడు" 'అయినె- తన బతుకును సూసుకోక గరీబోల్ల బతుకులు సూసిన అయినెను బతుకనిచ్చిండ్లా?'

గోపయ్య మతికొచ్చేసరికి నీల మనసు చెరువై పోయింది.

సన్నగా వర్షం ప్రారంభమయ్యింది.

తనిక ఈ తన్నులు తినలేదు.... ఎవలకు మాత్రం పనికిరాని తను బతికెంత ? బతుకకపోతే ఎంత ? ఈ పసిగుడ్డో - వాన్ని నేను మనుండగనే బుక్కెడంత బువ్వ దినిపిచ్చే దిక్కులేదు. నేను పోయినంక నా దినవారాలు గాక ముందే ఇంకోదాన్ని తెచ్చుకుంటడు - నా మీద కోపాన్ని అత్త, భర్త పిల్లగాని మీద చూపెడుతరు. కనుక నా అంశ ఈ భూమ్మీద బతుకద్దు.

నీల లేచి నిలబడింది. చీకట్లో - దెబ్బలుతిని, జుట్టు ఊడిపోయి, బట్టలు చిరిగి నీల పిచ్చిదానిలాగున్నది. చేతుల్లో కొడుకు చలికి వణుకుతున్నాడు. మెరిసిన మెరుపులో కొడుకు అమాయకమైన ముఖం - నీల వాకిట్లో నుండి మొంపిగోడ దాటి బజార్లోకొచ్చింది. నీల మెదడులో ఆలోచనలన్నీ ముద్దయిపోయాయి.

చిమ్మంచీకటి - చిమ్మెట్ల రొద - ఉండీ ఉండీ గుడగుడలాడే ఆకాశం. కాంతి విహీనమైన మెరుపులు, బలహీనంగా కురిసే సన్నటి తుంపర - నీల దక్షిణ వేపు నుండి ఉత్తరవేపుకు వడివడిగా నడుస్తోంది.

హన్మంతుని గుడి, రైతుల గూనిండ్లు, వడ్లధాతి, కమ్మరి కొలిమి, గుడిసెల వరుస - చివరన ఎక్కడో కుక్కలు మొరుగుతున్నాయి. రాత్రి ఎంతయ్యిందో తెలియదు.

భుజంమీద ఎత్తుకున్న కొడుకుకు కొంగు కప్పింది - తడిసిపోయి గజ గజ వణుకుతున్నాడు. తల్లి భుజాన్ని బిగ్గరగా కరిచి పట్టుకున్నాడు. నీరసంగా ఏడిచాడు - నీల ఎవరైనా అడ్డగిస్తారేమోనని గుడిసెల్లో నుండి వడివడిగా నడిచింది - గుడిసెలు ఆఖరైన చోట బండ్లబాటకు అపక్క ఈపక్క 'నీల్ల బొదరు'లో ఎత్తుగా పెరిగిన తుంగమీద వాన చినుకులు శబ్దం చేస్తున్నాయి... అప్పుడప్పుడు 'నప్పున' గాలితెర వీస్తోంది. నీళ్ళ బొదరులో చిన్న కప్పలు తప్పెట్లు కొట్టి నట్టుగా అరుస్తున్నాయి. ఎక్కడో 'నీరుకట్టెపాము' కప్పను మింగినట్లున్నది. కప్ప చిత్రంగా అరుస్తోంది.... ఆ తుంగ దాటిన తరువాత పెద్దకాలువ వొచ్చింది. ఆ దారి సీదా గుట్టకేసి పోతుంది - కాలువ మీద మోరి - ఎడంకేసి నడుస్తోంది.

అట్లా కొంతదూరం నడిచింది. 'ఊడుగు పొదల' పక్క పెద్ద పరుపుబండ - పరుపు బండనానుకొని 'నక్కలబోరు' నక్కల బోరు పై భాగంలో 'చిన్నయ్య పెద్దయ్య దేవుడి' పందిరి....

నీలమ్మ ఊడుగు పొద పక్కనే పెద్ద బండసాటుకు కూర్చున్నది - మోకాళ్లమీద కూర్చుండి కొడుకుకు పాలు పట్టింది ఆఖరిసారిగా ముద్దులాడింది ... ఒళ్ళంతా తడిమి తడిమి చూసింది. ఎక్కడో తల్లి పేగు తిరుగబడుతోంది.... ఏ ఆలోచనకు చోటివ్వకుండా లేచి నిలబడి - గుట్టబోరును - చీకట్లో పాములా మెలికలు తిరిగిన కనిపించని ఊరును చూసింది.... కన్నతండ్రిని, కట్టుకున్న వాన్ని కసితీరా తిట్టింది ... తనను మనిషిగా చూసిన మనిషి - తను నడిమందిలో అవమాన పరిచినాకూడా అది మనసులో ఉంచుకోని మనిషి గోపయ్యకు సజల నేత్రాలతో మనసులో మొక్కింది.... కాలువకేసి నడిచింది. నీల అనే ఇరవై అయిదేండ్ల స్త్రీ కోట్ల స్త్రీలలాగే తన బతుకు, తన కొడుకు బతుకు అంతటితో అంతం చేసుకోవాలని నడిచింది.

* * *

చుట్టూ విస్తరించుకున్న పొలాల మధ్య ఎప్పుడో కట్టిన గుడి ఒకటున్నది. దానిచుట్టూ, సీతాఫలాల చెట్లు, ఊడుగు చెట్లు పెరిగి అదో పచ్చటి ముద్దలాగున్నది - అక్కడ పాములుంటాయని ఎవరుపోరు - 'కాముని భూతం' అక్కడ మంటలు వేస్తుందని కూడా ప్రచారం. అలాంటి గుడి పాడుబడ్డ మెట్ల మీది నుంచి అయిదుగురు మనుషులు లేచారు.

కురచగా ఉన్న మధునయ్య కాయిదపు సుట్టల్ని వరుకు కాయిదంలో సుట్టుకొని ధోవతిలో చెక్కుకొని మళ్ళీ ఏర్పడకుండా కట్టుకున్నాడు. పై నుండి యూరియా బస్తాలు అంచేసికుట్టిన "కోలాటం" వేసుకున్నాడు.

అఖరి వందనాలు తెలుపుకొని ఎటువాళ్లటు లేచిపోయారు. ఊరి వాళ్ళి ద్దరు కొంచెం తిరుగుడు దారిమీద వెళ్ళిపోయారు.

మధునయ్య చినుకులు "కోలాటంమీద పట్టర పట్టర పడుతుండగా బరుకు బరుకున శబ్దం నడుస్తుండగా కోలాటం చేస్తుండగా పొలాలగట్లమీది నుండి కాలువ గట్టెక్కాడు. వడి వడిగా నడుస్తున్నాడు.

ఎదురుగా చీకట్లో అడుగుల చప్పుడు. మధునయ్య హఠాత్తుగా ఆగిపోయి ఈ వేళప్పుడు ఎవరిక్కడున్నది? ఆలోచించాడు.

నీడలాగా చీకట్లో ఆకారం వడి వడిగా నడుస్తోంది .... ఓ మెరుపు మెరిసింది.

మధునయ్య ఆ మెరుపులో ఆ ఆకారం ఒక స్త్రీదని గుర్తించాడు.

ఆ ఆకారం కాలువకేసి పరుగెత్తుతోంది. కాలువలో చేతిలోది ఏదో విసరడానికి ప్రయత్నం చేసింది. మధునయ్య మరింత అలస్యం చేయకుండా పరుగెత్తి ఆ ఆకారంమీద కలెబడి చేతిలో అబ్బాయిని గుంజుకున్నాడు.

"వన్నిడువు. నన్ను బతుకనియ్యకు - నీకు పున్నెముంటది - నన్ను వొదులు." ఆ ఆకారం పెనుగులాడింది.

మధునయ్య ఆ ఆకారాన్ని గట్టిగా పట్టుకున్నాడు.

ఆ ఆకారం కాళ్ళమీదపడి ఏడుస్తోంది. మధునయ్య చేతుల్లో పిల్లవాడు ఏడుస్తున్నాడు.

మళ్ళీ మెరిసింది. ఈసారి మధునయ్య ఆ ఆకారాన్ని గుర్తించాడు.

"నువ్వా అక్కా!" మధునయ్య నీలమ్మ ఆకారాన్ని చూసి విస్తుపోయాడు.

"వన్నిడువుతమ్మీ." నీల.

"అక్కా! సచ్చేం సాధిత్తవ్ - నా బొందిలో పానముండంగ మిమ్ముల సావనియ్య" మధునయ్య బలవంతంగా నీల చేయి దొరకబుచ్చుకొని ఊళ్ళోకి నడిపించాడు.

నీలమ్మ గింజుకుంటూ, ఏడుస్తూ పిచ్చిదానిలా మధునయ్య వెంట నడిచింది.

పందిరికిందికి రాగానే "ఇగో నిన్నే పన్నవా? జెరంత దీపం ముట్టియ్య" కేకేశాడు.

దీపం వెలిగింది- మధునయ్య భార్య, తల్లి పోశాని లేచివొచ్చారు.

"గిప్పుడు ఏమడుగకుండ్లి - నీరయితె ఉంటె తెచ్చియ్య" మధునయ్య-పోశాని కోడలును అడిగి ఎవరో తెలుసుకున్నది.

"అయ్యో నీలవ్వ తల్లీ నువ్వా!" అన్నది.

నీల పోశాని మీదపడి వెక్కి వెక్కి ఏడ్చింది - కుమిలికుమిలి ఏడ్చింది- పొర్లి పొర్లి ఏడ్చింది.

"నీలవ్వా! నీ జాంచెన్ బిడ్డా! కష్టాలకు అదులుతారు తల్లీ - పుట్టెడు దెబ్బలుదిన్న భూదేవరవు తల్లీ - అందరికి, అన్నిటికి ఉదరున్నదిగానీ ఆడిదాని దుఃఖానికి ఉదరులేదు నీలా!" పోశాని ఒళ్ళంతా పునుకుతూ నీలమ్మను కడుపుల దాచుకున్నది. నీలమ్మ తను పుట్టిన దగ్గరినుండి, పుట్టి బుద్ధెరిగిన కాన్నుండి అలాంటి ఆదరణ ఎరుగదు.

"కష్టాలు మనందరి బతుకుల్లో ఎప్పుడు ఉంటయి. అటిని ఎదురించాలె నమ్మా...." అన్నాడు మధునయ్య.

నీలకు గోపయ్య అన్నమాట గుర్తొచ్చింది....

ఆ తరువాత మధునయ్య, అతని భార్య వెంటరాగా నీలమ్మ మళ్లీ ఇంటి కొచ్చింది.

మధునయ్య జబర్దస్తీగా తలుపు తట్టాడు. తలుపు తెరుచుకున్నది.

సత్యనారాయణ కక్కుకొని నేలమీద అదే కక్కులో అసహ్యంగా పడున్నాడు. అశబ్దానికి ముసలి రంగమ్మ లేచివొచ్చింది.

"ఇగో - అమాసచ్చిందని సంబర పడకుండ్లి - ఇకనుంచి నీలవ్వ సెల్లెనేమన్నా అంటే పులుసులకు బొక్క లేకుంట ఊళ్ళోల్లంత దంచుతరు. నీ దొరలే అత్తరో దాతలే అడ్డమత్తరో సూత్తం - ఏ ముసలి రంగమ్మా? - ఈ ఊళ్ల పెండ్లాలను - మొగల్లు కొట్టే కాలంబోయింది - నీ కొడుక్కు చెప్పు" మధునయ్య.

ఆ లొల్లికి ఎన్నడూ ఆ ఇల్లు సొచ్చుకరాని ఊళ్లో వాళ్లంతా వచ్చారు.

అందరు రెచ్చిపోయి తలా ఓ తిట్టు తిట్టారు.

"కాలో సెయ్యో ఇర్సి పారేత్తె పీడబోతది - గవాయెవడొత్తడో సూత్తం" ఎవడో మందిని తొలిగించుకొని సత్యనారాయణమీది కురికాడు. ఎవరో అతన్ని ఆపారు.

సత్యనారాయణ మత్తుగా కండ్లు విప్పిండు. అందర్ని చూసి ఉచ్చ బోసుకున్నాడు. పరుగెత్తబోయి పడిపోయాడు.

"జెర పెయిల భయముంచుకో - నిన్ను ఏ దొరలు కాపాడలేరు." మధునయ్య సత్యనారాయణ జబ్బపట్టి లేపి అన్నాడు ... సత్యనారాయణ గజ గజ లాడి పోయాడు.

"సూడుసెల్లే ఇకనుంచి నువ్వు ఊళ్ళె అందర్ల మనిషివి. ఈడు ఏకతలు సేసినా ఊరందరికి తెలుత్తది- అప్పుడు సూసుకో-"

తిట్లు, దీవెనలు అయిపోయినయ్. ఎటువాళ్ళటు పోయారు.... మధునయ్య కూడా వెళ్ళిపోయాడు.

నడిరూమురాత్రి - చీకటి నిండినరాత్రి - చిల్లం కల్లం అయిన ఇల్లు- తాగుబోతు, తిరుగుబోతు భర్త- నీల పందిరికింద ఖిన్నురాలై కూర్చున్నది.

నెత్తురు చెరువులోనుండి - మబ్బుల్లోని మెరుపు తునకలా ఎవరో పైకి లేస్తున్నారు.... ఆ ఆకారం నీలకు తెలియడంలేదు. ఆ ఆకారానికి కాళ్ళు, తల, ముక్కు, చెవులు లేవు. మెరుపు తీగలాగున్నది.

"నన్ను చెడ్డోనిగ చూడకు నీలా! నన్ను నీ కష్టంలో మతికుంచుకో! నన్ను మతికుంచుకోవడమంటే - మేం దేనికోసం కొట్లాడుతున్నామో దాన్ని తెలుసుకోవటం- కష్టాలను సహించి ఊకోవద్దు - కొట్లాడాలె- నాకు నీ మీదగాని, నీ భర్తమీదగాని కోపంలేదు నీలా! నువ్వు ఒంటరి దానివికాదు నీలా!"

ఆ మెరుపు తన ఒకప్పటి భర్త గోపయ్యదికాదు. గోపయ్య తనకు భర్త ఎప్పుడూకాదు. భర్తలాగా ఎప్పుడు హింసించలేదు. అతన్ని చంపేశారా?

మరేమిటి ?

తనలాంటి వాళ్ళందరిలో నిరంతరం పారే నెత్తురు .... కళ్ళకు వెలుతురు.

★